
# కవిగారి కథ



డామిట్! కథ అడ్డం తిరిగింది. డిష్ట్రిబ్యూటరిచ్చిన ఇనిస్టాలుమెంటు డబ్బు కాస్తా ఆరోజు రాత్రి రన్‌మోరులో అయిపోయింది. అతనిస్తాడని మభ్యపెట్టి చేసిన అప్పుకూడా గల్లంతైపోయింది. వెధవది. ఇటు అసలు ప్రొడ్యూసరుగ్గా నటు డిష్ట్రిబ్యూటరుగ్గా నిటు స్టుడియోవాడిగ్గా నటు హీరో సెక్రట్రీగ్గా నటు రికార్డింగువాళ్ళగ్గా నిటు కవిగాడిగ్గా నటు యింటి వాడిగ్గా నటు పబ్లిసిటీవాడిగ్గా నిటు మరెవడిగ్గాని కనబడిందికీ వీల్లేకండా అష్టదిగ్బంధం అయిపోయింది. హోటేలు వెధవా సిగరెట్లపీనుగా కూడా సొరనడం మానేశారు నిన్నట్నించి. నేడో రేపో మంచిరోచ్చూసి చొక్కా పట్టుకునేట్టున్నారు. ఆఖరికి బాకీలవాళ్ళు కూడా ఇవల్యూషన్‌లో అప్పులవాళ్ళయిపోయారు! యరక్క చిక్కడ్డాఁవిందులో. వెధవది పద్మవ్యూహఁవంటే ఇదే కాబోలు. జొరబడిపోడం మహ సుళువుగాని ఊడవతలపడ్డఁవే చిక్కు. ధర్మరాజు గడుసువాడు. అందికే అభిమన్యుణ్ణి తోలీశాడు నంగనాచిలా. నంగనాచేవిఁటి ప్రాక్టికల్ ఫెలో. జూదవాడ్డం ఒహటి తెలివితక్కువపని. ఆ మాటకొస్తే నేనాళ్లేదూ. ఏం చేస్తాం. ఎటికెట్ ఏట్లో కలిసిపోతుందాయె. పేకాట దగ్గిర వెనకాడితే పరపతి తిరపతెళ్ళి కళ్యాణమండపంలో తలొంచుక్కూచుంటుంది.

ఇప్పుడిహ నాబోరు దక్కాలీ అంటే, మనం కూడా స్ట్రాటజీ మార్చాలి. నెమ్మదిగా ఏ అభిమన్యుణ్ణో--కాస్త చురుకుపాలు, ఇంటి దగ్గర కాస్తంత తడీ ఉన్నవాణ్ని చూసి ఇందులోకి దింపేస్తే సరి. స్ట్రాటజీ మార్చకపోతే పొలిటీషియన్ కానేరడన్నాడు. ఈ వింటర్ హాలీడేస్‌కి వాళ్లూరే ఊటీ అనుకుని చద్దివణ్ణవే బ్రేక్ ఫాస్టు, తరవాతే కాఫీ 'గట్రా' అనుకుంటే సరి. ఇక్కడ సద్దుమణిగేదాకా అక్కడే బిచాణావేస్తే కాస్త ట్రిక్కుపై మీద కూచున్నట్టూ ఉంటుంది. పన్లోపని ఓ కొత్త ప్రొడ్యూసర్ని రంగంలోకి దింపి అరంగేట్రాల్ చేయించినట్టూ ఉంటుంది. ఏ పల్లెలో ఏ ప్రొడ్యూసరున్నాడో ఎవడి కెరుక. "కొత్తధనం, కొత్తదనం" అన్నాడు మాటగారడీవాడు. అన్నిటికన్న ముఖ్యం దేశసేవ చేయడం అవుతుంది. వెధవది ఉన్న డబ్బంతా ఈ పల్లెటూళ్ళలో రాటయిపోతోంది నా టాలెంట్సులాగ. విలువైన నోట్లు అలా అక్కడ చిక్కడిపోమట్టే పాపం కోయంబత్తూర్లో మారునోట్లు తయారు చేస్తున్నట్టున్నారు--నాలాంటి టాలెంటెడ్ జీనియస్సులు రాటవుతున్నపుడు, ఇమిటేషన్ జీనియస్సులు దొంగనోట్లలాగే తయారింపయి పోతున్నట్టు. కాని దొంగనోట్లు తప్పట్టినవాళ్ళు ఇమిటేషన్ పిక్చర్లనీ, డైరెక్టర్లనీ, జీనియస్సుల్నీ పట్టుకోరు. వీళ్ళకి బొత్తిగా పబ్లిసిటీ ఇవ్వరు....ఇన్‌జస్టిస్! దై నేమ్ ఈజ్ జస్ట్ ఇన్ జస్టిస్.

అడుగో గుర్నాధం వస్తున్నాడు. వీడు లాస్టు పిక్చరుమీద చంద్రలేఖలా బోల్డు లక్షలు లాభాలొస్తాయనీ, అవి దాచటానికి పెరట్లో పాతర్లు తవ్వించడంగాని లోగిట్లో పబ్లికున గాదెలు కట్టించడం గాని ఆరంభించ మన్చెప్పి పాతికవేలట్టుకు చక్కా వచ్చాడు లాస్టియర్. పూర్ ఫెలో. నన్నుచూసి రుడుసుకుని హరీశంగాడి ఉచ్చులోపడి హరీమన్నాడు మూడు పూటల్లో--నాటికీ నేటికీ పిక్చరూ లేదు వీడి పిండాకూడూ లేదు. ఇంటికెళ్ళింది గ్లుండెల్పాలవు. పాండీబజారు తురాయిచెట్లకి ఊడలా వేళ్ళాడుతూ ఉండిపోయాడు. వీణ్ని కొంచెం ఉద్ధరించడం ఉత్తమం. వీళ్ళబాబుకి డబ్బు దాచిందికి చోటుచాల్లేదుట ఇంట. యేం చేస్తాడు. పసుపు, పొగాకూ కురిపించే లక్షల్ని బస్సురూట్లకి మళ్ళించిందికిహ వీల్లేదాయె నేషనలైజేషన్ ఖర్మమా అని. ఇద్దాచింది కింకో లోగిలి కట్టించాలంటే ఎవరూ స్థలాలమ్మటం లేదట దగ్గిర్లో. బాంకువాళ్ళు మేం దాచలేం బాబో అంటున్నారు. వేళయినా పాలుపితకని గేదిలా గిలగిల్లాడుతున్నాట్ట పాపం.

నేను కాస్త నోరుజేసుకొని ఈ అర్భకుడి వెంట వెళ్తే కాస్త ఒళ్ళు తేలిక చేయించొచ్చు.

హల్లో! ఏమి గురూ! మొహం వేలవెయ్యలేదు. ఏమి గిరాకీ, మనియార్డరొచ్చిందా కాపోతే ఇంటికి రానిస్తానని మీనాన్న కబురంపాడా?....... నువ్వెలాగేనా గట్టివాడివిలే. ఆ భూమాత్తరవాత సహనానికి నిన్నే చెప్పుకోవాలి గురూ.

తెల్లబోకు నీ పేరు గురునాధమనే కాదు గురువనే భావనతో కూడా పిలుస్తున్నాను. ఏం జేస్తాం గురువు శిష్యుడాయె, శిష్యుడు గురువాయె. నామాట నువ్వినానికాడికి నీమాట నేనేనా వింటాను. నువ్వు చెప్పినట్టే ఈసారి వింటర్‌కి మీ యింట మకాం చేస్తాను.

ఏవిటీ, నామాటే నువ్వింటావా, యలాగేనా ఒహటే, నన్ను చెప్పమన్నా అమాటే అంటాను. కోటినదులు--కాదు కాదు ఆల్ రోడ్స్ లీడ్ టు రోమ్. నామాటా నీమాటా కూడా మీయింటికే నడవమంటున్నాయి. అయినా ఈ మాట నువ్వార్నెల్లక్రితం అఘోరిస్తే ఎంత బాగుండేది. పిక్చరు కాపోయినా, కనీసం ఎక్స్‌పీరియన్సేనా అఘోరించేది. నాతో మాట్టాడవే ఓయెడ్యుకేషనంటే విన్నావు కాదు. కనీసం ఆ హరీశంగాడితో మాటాడకపోవడం అంతకన్న ఘనమైన యెడ్యుకేషనంటే అదీవిన్నావు గాదు. ఫరవాలేదు. 'బెటర్లేట్ దాన్నెవ్వర్ ' మించిపోయిందేవీ లేదు.

మనవూరెళ్దాం పద. నాదగ్గిరో బ్రిలియం టైడియా ఉంది. పూర్తిగా మన్దికాదనుకో, దాన్దేవుంది. చేసుకుంటే సరి. మరేం కాదు. ఎక్సుపిక్చర్సు వారి నెక్స్‌ట్ పిక్చరిక్కథ లేకుండానే ఏణ్ణర్ధంనాడు మూటిం గారంభించేశారు ఏదో అవేళ మంచిరోజుగదా అని, హీరోయినూ అవేళ కాల్షీట్లు కాన్సిలై కాళీగా ఉన్నదనిన్నీ, అందుకు తగ్గట్టే దగ్గిరే వున్న స్టూడియోలో సెట్టోటి కాళీగా పడుందనిన్నీ గమనించి ప్రొడ్యూసరుగారు ఉత్సాహపడ్డాడు. వారి బ్రదరిల్లా ఇంజనీరు. సెలవులకొచ్చాళ్ళే. ఊరికే అలా బడుద్ధాయిలా ఆడపిల్ల లెదట నోరెళ్ళబెట్టుక్కూచోపోతే అదేదో కామెరా ఎదర అఘోరిస్తే సరిపోనుగా, డైరెక్షను చేసినట్టూ ఉంటుంది పిక్చరూ ఓటి తయారవుతుందీ అన్నాడు. అతనూ సరే అన్నాడు. సరే అంటే సరే అనుకున్నారంతా. వెంటనే ఓషియానికులో కవిగార్ని ఫోనులో పిలిచి అర్జంటుగా ఓ కథ చెప్పమన్నాం. వెయ్యి రూ॥లు అడ్వాన్సడిగాడు. మనిషికిచ్చి పంపాం. అదందుకోగానే

ఇవాళ్టికి లవుసీను తీసెయ్యండి రేపోమాపో కథ చెబుతాను అవటాని, అక్కడికి పనికొచ్చే డైలాగులు రెండు ఫోనుమీదే చెప్పేశాడు. సరే పిక్చరారంభమైంది. ఆ తరవాత అడపా తడపా కాస్తో కూస్తో కథ చెబుతూ రావడం, వీళ్ళు షూటింగు తీస్తూ రావడం జరిగింది. కథ ఊహాతామరలా పాకేస్తోంది. కారెక్టర్లు కుచేల సంతానంలా, బాల్నాగమ్మలో గందోళిగాడి పిల్లల్లా, డబ్బున్న వాడింట బంధుమిత్రుల్లా పెరిగిపోయాయి. పదిరీళ్ళయినా దారీ తెన్నూ లేదు. ఉన్న కారెక్టర్లనే చంపో, దేశాంత్రాలు తరిమేసో కథని ఆపుచేదామన్నా పాతికరీళ్ళు దాకా పట్టేట్టుంది. జగదలప్రతాపనంత పిక్చరన్న మాట. ఏదిదారీ, అసలు నీ కథేమిటో దాని క్లయిమాక్సేవిటో చెప్పవయ్యా మగడా అని కంపెనీ జనాభా యావత్తూ కవిగారి కాళ్ళావేళ్ళా పడింది. అయన లోగడ చాలాసార్లు వీళ్ళ కాళ్ళా వేళ్ళా పడ్డాట్ట. అంచేత ఆ సరదా తీరేదాకా కాళ్ళు పట్టించుకున్నాడు. ఆ తరవాతేమో దాన్దేముంది సార్. అంతా మీ యిష్టం, మీరెలా చేదామంటే అలాగే చేదాం. క్లయిమాక్సు గ్రట్రా ఎలా వుండాలో మీరే చెప్పండి అనేశాడు కవి చల్లగా. లోగడ ఆయన అయిడియాలు వీళ్ళు తోసవతల పారేశారన్న కసీ వుందిగాని, అందుకోసం ఇలా చెప్పలేదనుకో. ఆ కవిగారికి వీళ్ళ దగ్గిర రెండువేలు అడ్వాన్సు పుచ్చుకున్న వైనంగాని, వీళ్ళ పిక్చరుకి చెప్పిన కథ వైనంగాని, అసలు కథంటూ ఓటి చెప్పిన వైనంగాని యంతమాత్రం గుర్తు లేదు. అంతా పరగడుపై పోయింది. పోనీ జరిగిన కథేమిటో వీళ్ళనే చెప్పమన్నా వీళ్ళుగాని ఎవళ్ళుగాని చెప్పగలిగేదేవుందిట! అదీ కథ. అంచేతది డెడ్లాకులో పడింది. అనగా శాపగ్రస్తం అయిపోయింది. దాని రహస్యం ఈ గిరీశంగాడికొకడికే తెలును.

కావున ఓ గురూ! ఇపుడు నువ్వు గనక నాకు మీయింట వింట్రి సార్టేర్పరిస్తివా ఆ కథ జ్ఞాపకం చేసుకుని డైలాగులు సహా అంతా రాసేసి తరువాయికథ, క్లయిమాక్సూ కూడా, దాన్ని మీ తండ్రిగారికి చూబిద్దాం. ఓ మంచి రోచ్చూసి వార్ని చెన్నపట్నం పట్టుకొద్దాం ఎక్స్ ఫిలింసు వారికి తెలీకుండానే. వాళ్ళు రషెస్ వేసుకునేటప్పుడు ఈయన్ని గుట్టు చప్పుడు కాకుండా లోపలికి తోసేసీ ఆ కాస్తా చూపించి, మళ్ళీ గుట్టు చప్పుడ్లేకుండా మనవూరు తీసుకుపోయి, ఆ తీసినఫిలిం మనదేననీ డిస్ట్రిబ్యూటరనే ఒకానొక రాక్షసుడి చేతుల్లో రాజకుమార్తెలా ఏడుస్తోందనీ, మీ నాన్నగనక ఓ యాభైవేలు పారేస్తే దాన్ని

విడిపించి పిక్చరు పూర్తి చేసి లక్ష నొల్లుకోవచ్చుననీ చెబుదాం. తీసింది పనికిరాకపోతే దాన్నే చెరిపించి మరో కథగా మరో పిక్చరుగా రాయించొచ్చుననీ చెబుదాం. ఏవిఁటి? ఇంతవరకు తీసినట్టిపిక్చరు నిర్వాక వేననీ, నువ్వు పేల్చినట్టి ప్రజ్ఞేననీ చెబుదాం ఎవడి కోసం ఇస్తారూ...వాట్.

థాంక్స్, థాంక్స్, మరేవిటనుకున్నావు గిరీశవంటే? రైట్. ఈ అయిడియా తాకట్టేసి రైలు ఖర్చులకో వంద చూడు, నేను స్టేషనుదగ్గిర కల్సుకుంటాలే. చూడు, స్పెన్సరు సిగార్సు ఓ పెట్టె, మస్తుగా టిఫిను, రెండు దస్తాల పేక, నాలుగు దస్తాల తెల్లకాయితాలూ ఆలోపల జతపడితే ఓ దస్తాపదిరూపాయలనోట్లూజాగర్జెయ్యి. నాక్కొంచెం రాచకార్యాలున్నాయి. ఈలోగా చక్కబెట్టుకొస్తాను. నీచొక్కా చేతిమడతలో దాచుకున్న పదిరూపాయల్నో టిలా పారేయ్. తల్చుకుంటే నిమిషాలమీద పడుతుంది నీకు డబ్బు. థాంక్స్, వెయ్యేళ్ళకీ ఇలా నా కిచ్చేంత గడించు....చూడూ ఈముక్క అదే 'మనం' కాంపెళ్తున్నట్టు - అప్పుకోసవేఁనా సరే ఎవరితోనూ అనకేం, అనవసర పబ్లిసిటీ, జనం కాళ్ళావేళ్ళా పడి ఆపేస్తారు.

